క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మురళీనగర్: జోన్–2 డివిజన్ మురళీనగర్ సెక్షన్ పరిధి మురళీనగర్ 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎన్‌జీజీవోస్ కాలనీ, వర్మా కాంప్లెక్స్ ఏరియా, మురళీనగర్, బాలభాను పాఠశాల ఏరియా, బర్మా కాలనీ, పట్టాభిరెడ్డి గార్డెన్స్, ఎన్‌జీజీవోస్ కాలనీ, అయ్యప్పనగర్, మసీదు ఏరియా, సింగరాయిమెట్ట, మంచుకొండ గార్డెన్స్, తెన్నేటినగర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

పెండింగ్ కేసులు పరిష్కరించండి

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ క్రైం పోలీస్ స్టేషన్‌ను గురువారం క్రైం ఏసీపీ వెంకటరావు సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ పలు కేసుల్లో ముద్దాయిలపై నిఘా పెట్టాలని సూచించారు. పెండింగ్ కేసులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. నేరాల కేసుల్లో దర్యాప్తుపై ఎస్‌ఐ భాస్కరరావును అడిగి తెలుసుకున్నారు. ఇటీవల జరిగిన దొంగతనం కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా నేరస్తులను పట్టుకోవాలని సూచించారు. రాత్రి నిఘా పెంచాలని, ప్రతి అపార్ట్‌మెంట్‌ల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సునీల్, శ్యామలాదీపిక

సీతమ్మధార: టీం 47, చరణ్ ఆధ్వర్యంలో గురువారం సీతమ్మధార ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ వెనుక రోడ్డులో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామలాదీపిక, అల్లుడు సునీల్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రక్తదానంతో ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయండి.. ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడండి అని పిలుపునిచ్చారు. ఏడీసీపీ గంగాధరం, సీఐలు మల్లికార్జునరావు, చక్రధర్, కార్పొరేటర్ ముక్కా శ్రావణి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్రరెడ్డి, పరశురాం రాజు, వందే భారత్ బ్లడ్ బ్యాంకుకు 68 యూనిట్లు అందజేశారు. వందే భారత్ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి వినోద్ బాల్ తదితరులు పాల్గొన్నారు.

80 ఫీట్ రోడ్డులో అంధకారం



80 ఫీట్ రోడ్డులో చెట్ల కొమ్మల మాటున వీధిలైట్లు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు క్రౌన్ బేకరీ ఎదురుగా ఉన్న 80 ఫీట్ రోడ్డులో చీకటి పడితే అంధకారం అలుముకుంటోంది. ఈ రహదారిలో డివైడర్‌పై ఉన్న వీధిలైట్లు వెలుగుతున్నా.. చెట్ల కొమ్మలు అడ్డుగా ఉండటం వల్ల రోడ్డుపై వెలుతురు పడటం లేదు. దీంతో ఈ ప్రాంతం అసాంఘిక కార్యక్రలాపాలకు అడ్డాగా మారింది. చీకటి పడ్డాక మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారని, కేకలు, గొవడలతో గోల చేస్తున్నారని అపార్ట్‌మెంట్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కోసారి వీధి దీపాలను ఆపివేసి మరీ అల్లరి చేస్తున్నారంటున్నారు. 80 ఫీట్ రోడ్‌లో చెట్ల కొమ్మలు తొలగించాలని, పోలీసులు ఈ ప్రాంతంపై దృష్టి సారించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

దిష్టిబొమ్మల్లా ట్రాఫిక్ సిగ్నళ్లు



ఇండస్ట్రియల్ ఎస్టేట్ రహదారిలో ఇలా..



కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారి కూడలిలో నిరుపయోగంగా ట్రాఫిక్ సిగ్నళ్లు

- బీఆర్‌టీఎస్ రహదారిలో పనిచేయని ట్రాఫిక్ సిగ్నళ్లు
- గందరగోళంగా వాహనాల రాకపోకలు
- ప్రమాదాల బారిన చోదకులు, పాదచారులు
- దృష్టి సారించని ట్రాఫిక్ పోలీసులు

కంచరపాలెం: బీఆర్‌టీఎస్ రహదారిలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నళ్లు సక్రమంగా పనిచేయడం లేదు. కంచరపాలెం మెట్టు నేతాజీ ఫ్లైఓవర్ వంతెన కూడలి, ఊర్వశి జంక్షన్, ఐటీఐ జంక్షన్, ఇండస్ట్రియల్ ఎస్టేట్ జంక్షన్, 104 ఏరియా కూడలి, మర్రిపాలెం ప్రాంతాలకు వెళ్లే బీఆర్‌టీఎస్ రోడ్డులో సిగ్నల్ లైట్లు వెలగడం మానేశాయి. దీంతో అటుగా వాహనాలపై రాకపోకలు సాగిస్తున్న వారు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఈ కూడళ్లలో ప్రమాదాలు సంభవిస్తున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు.

తుప్పుపట్టి నిరుపయోగంగా..

బీఆర్‌టీఎస్ రోడ్డులో ఐదేళ్ల కిందట ఎల్లో స్తంభాలతో ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేశారు. కాలక్రమేణా అవి తుప్పు పట్టి దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. నీలం రంగులో ట్రాఫిక్ సిగ్నల్ స్తంభాలు పాత వాటి పక్కనే ఏర్పాటు చేశారు. ఏళ్లు గడుస్తున్నా.. వాటిని వినియోగంలోకి తీసుకురాలేదు. కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారిలో ఉదయం, సాయంత్రం వేళల్లో అధిక సంఖ్యలో వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా ఉంటుంది. ఆయా కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నళ్లు పనిచేయక పోవడంతో రోడ్డు దాటాలంటేనే స్థానికులు, పాదచారులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వాహన చోదకులు గందరగోళంగా రాకపోకలు సాగిస్తున్నారు. సంబంధిత అధికారులు పర్యవేక్షించి ట్రాఫిక్ సిగ్నళ్లను అందుబాటులోకి తీసుకురావాలని వారంతా కోరుతున్నారు.



ఊర్వశి జంక్షన్‌లో పనిచేయని ట్రాఫిక్ సిగ్నళ్లు

సిగ్నల్ లైట్లను వెలిగించండి



బీఆర్‌టీఎస్ రహదారుల్లో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయకపోవడంతో వాహన చోదకులు ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనగా ఉంటోంది. అధికారులు స్పందించి ట్రాఫిక్ సిగ్నల్స్‌ను వినియోగంలోకి తీసుకురావాలి.

– లగుడు వెంకటరావు, జ్ఞానాపురం

అధికారులు చర్యలు చేపట్టాలి



ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినా.. బీఆర్‌టీఎస్ కూడళ్ల వద్ద ట్రాఫిక్ సిబ్బంది లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సిగ్నల్ లైట్లు సక్రమంగా వెలగకపోవడంతో వాహనాలు, పాదచారుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– వెంకటేష్, కంచరపాలెం

రాంగ్ పార్కింగ్‌కు చెక్



80 ఫీట్ రోడ్‌లో టోయింగ్‌తో వాహనాన్ని తొలగింపజేస్తున్న సీఐ అమ్మినాయుడు, ఎస్‌ఐ వాణిశ్రీ



రాంగ్ పార్కింగ్ వాహనాల తొలగింపుతో ఖాళీగా కనిపిస్తున్న 80 అడుగుల రహదారి

సాక్షి ఎఫెక్ట్..

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు క్రౌన్ బేకరీ ఎదురుగా 80 ఫీట్ రోడ్‌లో రాంగ్ పార్కింగ్‌పై నగర పోలీస్ కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 80 అడుగుల రహదారిలో అక్రమ పార్కింగ్‌తో చుట్టుపక్కల అపార్ట్‌మెంట్ వాసులు పడుతున్న ఇబ్బందులపై ‘రాంగ్ పార్కింగ్’ శీర్షికన గురువారం ‘సాక్షి’లో ప్రచురించిన కథనానికి సీపీ శంఖబ్రత బాగ్చి సీరియస్‌గా స్పందించారు. ఫోర్త్‌టౌన్ ట్రాఫిక్ యంత్రాంగాన్ని పరుగులు పెట్టించారు. సీపీ ఆదేశాలతో ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు, ఎస్‌ఐ వాణిశ్రీ తన సిబ్బందితో హుటాహుటిన వచ్చి అక్రమంగా పార్క్‌చేసిన వాహనాలను యుద్ధప్రాతిపదికన తొలగించారు. రోడ్డు పొడవునా నిలిపివేసిన కార్లు, ఇతర వాహనాలను టోయింగ్‌తో తరలించారు. మరికొన్ని వాహనాల యజమానులను పిలిపించి ఇక్కడ వాహనాలు పార్కింగ్ చేయరాదని, చేస్తే ఈసారి జరిమానాలు విధిస్తామని హెచ్చరించి వాహనాలు తొలగింపజేశారు. అదే రోడ్‌లో ఉంటున్న కార్ల మెకానిక్ షాపు, సెకెండ్ హ్యాండ్ కార్ల షాపు యజమానులతో మాట్లాడారు. రాంగ్ పార్కింగ్ చేయవద్దని సూచించారు. రోడ్డు చివర బ్రిడ్జిని ఆక్రమించి పార్సిల్స్ వ్యాపారం చేస్తున్న సంస్థ నిర్వాహకులతో మాట్లాడి, పబ్లిక్ ప్లేస్‌లో వాహనాల పార్కింగ్, పార్సిల్స్ డంప్ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసుల చర్యలతో రాంగ్ పార్క్‌చేసిన వాహనాలు క్షణాల్లో తరలిపోవడంతో రోడ్డు విశాలంగా కనిపించింది. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఇంటిని తలపించేలా విద్యార్థులకు భోజనాలు పెట్టాలి



కప్పరాడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంఈవో దివాకర్

కంచరపాలెం: ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు ఇంటిని తలపించేలా పరిశుభ్ర వాతావరణంలో మధ్యాహ్న భోజనం అందించాలని గోపాలపట్నం మండల విద్యా శాఖాధికారి–2 డి.దివాకర్ సూచించారు. ప్రభుత్వ బడుల్లో బురదలో భోజనాలు శీర్షికన ఇటీవల అనేక కథనాలు రాష్ట్రంలో సంచలం రేపడంతో విశాఖ జోన్–2 ఆర్‌జేడీ విజయ భాస్కర్, జిల్లా విద్యా శాఖాధికారి చంద్రకళ ఆదేశాల మేరకు గురువారం కప్పరాడ జీవీఎంసీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఎంఈవో పర్యటించారు. మధ్యాహ్న భోజనాలు తినే ప్రాంతాలను పరిశీలించారు. డైనింగ్ హాల్‌లోనే విద్యార్థులకు భోజనాలు వడ్డించాలన్నారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆరుబయట భోజనాలు చేయరాదని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు విజయమాలిని, సుధాలకు సూచించారు. విద్యార్థులు బయట భోజనాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో దివాకర్ హెచ్చరించారు. మధ్యాహ్న భోజనాలు చేసే ముందు చేతులు శుభ్రంగా కడుక్కునేలా ఉపాధ్యాయులు విధిగా విద్యార్థులపై ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

సీఐలతో డీసీపీ సమీక్ష



సీఐలతో మాట్లాడుతున్న డీసీపీ సత్తిబాబు

మర్రిపాలెం: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు గురువారం కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో జోన్–2 పరిధిలోని సీఐలతో డీసీపీ మేకా సత్తిబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని, వాటిని సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. పలు కేసుల దస్త్రాలను పరిశీలించి తగు సూచనలిచ్చారు. ముఖ్యంగా గంజాయి, డ్రగ్స్ నిర్మూలన, రౌడీషీటర్లపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతరం గస్తీ నిర్వహించాలని సూచించారు. ఆకతాయిలు శాంతి భద్రతలకు భంగం కలిగేలా ప్రవర్తించినా, అల్లర్లు సృష్టించినా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీఐలు భాస్కరరావు, చక్రధర్, తదితరులు పాల్గొన్నారు.

21 కిలోల గంజాయి స్వాధీనం

సీతమ్మధార: పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఫోర్త్ టౌన్ పోలీసులు రైల్వేస్టేషన్ పరిధిలో తనిఖీలు నిర్వహించారు. సీఐ, ఎస్.విజయకుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది రైల్వేస్టేషన్ ఆవరణతో పాటు స్టేషన్ బయట బస్టాప్ ప్రాంతంలో తనిఖీలు చేస్తుండగా ఒక బ్యాగ్ కనిపించింది. చుట్టు పక్కల చూస్తే ఎవరూ లేకపోవటంతో సీఐ తన సిబ్బందితో బ్యాగు తెరిచి చూడగా గంజాయి ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 21 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

శివనగర్ యూపీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో



శివనగర్ ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: మర్రిపాలెం శివనగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని(యూపీహెచ్‌సీ) గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించారు. ఆరోగ్య కేంద్ర సిబ్బందికి జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ కోసం పలు సూచనలిచ్చారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌ను పరిశీలించి, కూలర్‌ను పరీక్షించి సూచనలు చేశారు. డీఎంహెచ్‌వో సమక్షంలోనే కొంతమంది మధుమేహం, టీబీ వ్యాధిగ్రస్తులకు వ్యాక్సిన్లు వేశారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ కార్యక్రమం జిల్లాలో ఏ విధంగా జరుగుతుందో పర్యవేక్షించడానికి జిల్లా ప్రోగ్రాం అధికారులు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి, జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, నోడల్ అధికారి బి.ఉమావతి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సమత వివిధ ఆరోగ్య కేంద్రాలను సందర్శించి సిబ్బందికి టీకా వేసే విధానం, వ్యాక్సిన్‌లో సిక్స్ ప్రియారిటీస్‌ను వివరించారు. లబ్ధిదారులకు వ్యాక్సినేషన్‌పై ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు.

సాధారణ ప్రసవాలు జరిగేలా చూడండి

యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని, సీ–సెక్షన్ ప్రసవాలను నివారించాలని డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు అన్నారు. ఆరోగ్య సిబ్బంది అందరు సమయపాలన పాటించాలని, ముఖ్యంగా స్టాప్ డయేరియా కార్యక్రమం మీద ప్రజలందరికీ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, వర్షా కాలంలో కీటక జనిత వ్యాధులు రాకుండా చూసుకోవాలని చెప్పారు. జిల్లా ప్రోగ్రాం అధికారులు, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై కళాజాత



కళాజాతలో గీతాలు ఆలపిస్తున్న కళాకారులు

గాజువాక: బాల్య వివాహాలవల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన కళాజాత అందరినీ ఆకట్టుకుంది. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 66వ వార్డు అజీమాబాద్ అంగన్వాడీ కేంద్రంవద్ద గురువారం కళాజాత నిర్వహించారు. కిశోర బాలికలు, బాలింతలు, గర్భిణులు, మహిళలకు బాల్య వివాహాలవల్ల తలెత్తే ఇబ్బందులను కళాకారులు ఆట, పాటలద్వారా వివరించారు. బాలల హక్కులు, చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి అంశాలతో పాటు అంగన్వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందించే పౌష్టికాహారం తదితర అంశాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్రవంతి, అంగన్వాడీ కార్యకర్తలు ఎస్.కె.మునీరా బేగం, ప్రవీణ, కళాజాత సభ్యులు పాల్గొన్నారు.

ధ్యాన మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు



వైద్య పరీక్షలు చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది



సాయిబాబా పల్లకీ సేవలో భక్తులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓమ్ని ఆర్కే హాస్పిటల్ సిబ్బంది సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి, భక్తులు, పేదలకు వైద్య పరీక్షలు చేశారు. సుమారు 100 మందికి బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించి, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం మధ్యాహ్న హారతి, అన్నదానం నిర్వహించారు. సాయంత్రం మహిళా భక్తుల చేతుల మీదుగా పల్లకీ సేవ, బాబా భజన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాల్లో ఓమ్ని ఆర్కే ఆస్పత్రి సిబ్బంది గౌరినాయుడు, చంటి, భాగ్య, ధ్యాన మందిర కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



యజ్ఞోపవీత ధారణ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన సేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై అధిష్టింప జేసి, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. అష్టోత్తర శతనామావళి పటిస్తూ 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. ఆలయ ఏఈవో ఆనంద్ కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామికి నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

స్ఫూర్తి ప్రదాత అల్లూరి

- మన్యం వీరుడి జయంతి వేడుకల్లో వక్తలు



అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బీజేపీ నాయకులు



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ శ్రీరామమూర్తి, అధికారులు



సీతమ్మధార జంక్షన్‌లో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కె.కె.రాజు, నాయకులు

సీతమ్మధార: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకలు గురువారం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. క్షత్రియ సమితి, క్షత్రియ యూత్ ఆధ్వర్యంలో సీతమ్మధార జంక్షన్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు పూలమాల వేసి నివాళి అర్పించారు. అల్లూరి జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు. అనంతరం రక్తదాన శిబిరంలో పాల్గొని పలువురు దాతలకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎన్ రాజు, డి.ఎస్.వి.వర్మ, బుల్లిబాబు, కోడూరిపాటి శ్రీను, అంజిరాజు, క్షత్రియ సమితి పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

- ఉత్తర నియోజకవర్గ కూటమి పార్టీ ఆధ్వర్యంలో సీతమ్మధార జంక్షన్‌లోని అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ నాయకుడు సునీల్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్, తదితర నాయకులు పాల్గొన్నారు.
- సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి తహసీల్దార్ జి.శ్రీరామమూర్తి, డీటీ ఎ.త్రినాథ్, ఆర్‌ఐ ఇబ్రహీం పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరి జీవితం ఆదర్శనీయం

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు ఈస్ట్ పార్కులో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అల్లూరి విగ్రహానికి కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పూల మాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య సాధనలో వీరోచిత పోరాటం చేసిన అల్లూరి జీవితం ఎందరికో ఆదర్శనీయమని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ దిడ్డి రమేష్, సీనియర్ నాయకులు బి.తిరుమలరావు, రాణి, జగన్, శ్యామ్, అప్పలనాయుడు, అప్పారావు, ఎర్నిబాబు, రామారావు, సింహాచలం, ఈస్ట్ పార్కు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

వాకర్స్ జిల్లా 101 డిస్ట్రిక్ట్ పూర్వ గవర్నర్ ఉప్పలపాటి శుభ ఆధ్వర్యంలో మాధవధార ఈస్ట్ పార్కులోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన మురళీనగర్‌కు చెందిన విద్యార్థులకు ఆమె ప్రోత్సాహక నగదు బహుమతులు అందించారు. బాలభాను, జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు, ఒక బాలికకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి, కార్యదర్శి ఎం.జయ, ట్రెజరర్ జి.షీలారాణి, ఓం వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు వి.ప్రమీల పాల్గొన్నారు.

నేటి తరానికి స్ఫూర్తి

మురళీనగర్: దేశ ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల సాధన కోసం తన ప్రాణాలను త్యాగం చేసిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి చేసిన త్యాగాలు, పోరాటాలు నేటి తరానికి స్ఫూర్తినిస్తాయన్నారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వాధ్యక్షులు ఎన్.బుచ్చయ్య, కేజీ కృష్ణారావు, సిహెచ్.కృష్ణమూర్తి ఎం.భాస్కరరావు, కార్యదర్శి పి.చెల్వరాజు, ఉపాధ్యక్షులు ఏవీ సుబ్బారావు, జాలీ వాకర్ ఎన్.ప్రకాశరావు, కార్యవర్గ సభ్యులు ఎస్.రామ్మోహన్‌రావు, పి.శ్రీనివాసరావు, ఎ.నూకరాజు, బి.సూర్యనారాయణ, జి.విజయలక్ష్మి, కె.ప్రసాద్, ఆర్.నాగేశ్వరరావు, వి.అప్పారావు పాల్గొన్నారు.



51వ వార్డులో అల్లూరికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ తదితరులు



అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభ్యులు



విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్న శుభ